క్లుప్తంగా

నేడు కౌన్సిల్ సమావేశం

122 అంశాలతో అజెండా సిద్ధం

అమలాపురం టౌన్: పలు అభివృద్ధి పనుల ప్రతిపాదన, ఆమోదం కోసం 122 అంశాలతో రూపొందించిన అజెండాపై మంగళవారం ఉదయం జరిగే మున్సిపల్ సమావేశం చర్చించనుంది. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో 122 రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులపై చర్చించి ఆమోద ముద్ర వేయనున్నారు. సాధారణంగా 50 నుంచి 80 అంశాలతో అజెండా రూపొందించి కౌన్సిల్‌లో చర్చించిన సందర్భాలు ఉన్నాయి. 122 అంశాలతో కూడిన అజెండాపై కౌన్సిల్ చర్చించడం చాలా అరుదుగా జరుగుతుంది. గత నెలలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా కొన్ని అభివృద్ధి పనులు అజెండాలోకి రాలేదు. దీంతో గత రెండు నెలలకు సంబంధించిన పెండింగ్ అంశాలను కూడా అజెండాలో చేర్చడం వల్ల ఇప్పుడు జంబో అజెండా అయింది.

చలివేంద్రం ప్రారంభం



కలెక్టరేట్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: చిందాడ గరువు ఎంపీటీసీ మోటూరి కనకదుర్గ, మోటూరి వెంకటేశ్వరరావు దంపతులు అమలాపురం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. గ్రీవెన్స్‌లో వినతులు సమర్పించడానికి వచ్చిన అర్జీదారులకు కలెక్టర్ మజ్జిగ పంపిణీ చేశారు. వేసవిలో గత మూడు సంవత్సరాలుగా కలెక్టరేట్‌లో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్న కనకదుర్గ, వెంకటేశ్వరరావు దంపతులను కలెక్టర్ అభినందించారు. ఏవో కడలి కాశీ విశ్వేశ్వరరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

యానాం: నియోజకవర్గ పరిధిలో ముస్లిం సోదరుల అభ్యున్నతికి కృషి చేస్తానని స్థానిక నాయకుడు సూదా భూషణం పేర్కొన్నారు. రంజాన్ పవిత్ర ఉపవాస దీక్షలను పురస్కరించుకుని సోమవారం స్థానిక జామియా మసీదులో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో ఇమామ్‌లు మహ్మద్ రఫీ, మహ్మద్ ఎజ్దానీ, మసీదుల అధ్యక్షులు ఎస్‌కేఎం జిలానీ, కాలేషా, ముస్లిం మత పెద్దలు తాజుద్దీన్, ఫిరోజ్, సయ్యద్ రిజ్వాన్, జిలానీ, కరీమ్ తదితరులు పాల్గొన్నారు.

ఒంటి కాలుపై నిలబడి నిరసన




ఒంటి కాలుపై నిలబడి నిరసన తెలుపుతున్న ఓడలరేవు గ్రామస్తులు

అల్లవరం: తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఓడలరేవు ఓఎన్‌జీసీ టెర్మినల్ వద్ద గ్రామస్తులు చేస్తున్న రిలేదీక్షలు 15వ రోజుకు చేరాయి. ఓఎన్‌జీసీ, ప్రోమోటెక్ కంపెనీలకు నిరసనగా ఆందోళనకారులు సోమవారం వినూత్న రీతిలో ఒంటి కాలుపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఓఎన్‌జీసీ మొండి వైఖరిని పలువురు ఎండగట్టారు. కార్యక్రమంలో కొల్లు విష్ణుమూర్తి, నాతి లెనిన్ బాబు, మందపాటి వెంకటేశ్వరరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇండియా కూటమి అధికారంలోకి వస్తే త్రిభాషా విధానం రద్దు

యానాం: 2026 అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే త్రిభాషా విధానాన్ని రద్దు చేస్తామని మాజీ సీఎం నారాయణ సామి పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే కూటమి జాతీయ నూతన విద్యావిధానం (ఎన్‌ఈపీ)తో దక్షిణాది రాష్ట్రాలపై హిందీని బలవంతంగా రుద్దుతోందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్, డీఎంకే ఆధ్వర్యంలో ఇండియా కూటమి విజయం సాధిస్తే తమిళంను మాతృభాషగా, ఇంగ్లిషును అనుసంధాన భాషగా చేస్తామన్నారు.

శాశ్వత ప్రాతిపదికన వైద్యులను నియమించాలి



అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో శాశ్వత ప్రాతిపదికన వైద్యుల నియామకం చేపట్టాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ కోరారు. సోమవారం పుదుచ్చేరి అసెంబ్లీ సమావేశాలు ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడారు. వివిధ విభాగాల్లో వైద్యులను నియమించాలని ఆపరేషన్లు, దీర్ఘకాలిక వ్యాధులకు వైద్యాన్ని అందించాలని తాను గత నాలుగేళ్లుగా అసెంబ్లీ దృష్టికి తీసుకువస్తున్నట్లు తెలిపారు. దీనిపై సీఎం రంగసామి మాట్లాడుతూ మరో నాలుగు నెలల్లో యానాం జీజీహెచ్‌కు యూపీఎస్సీ ద్వారా వైద్యుల నియామకానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

కరెంట్ కోత.. ప్రజలకు వెత

- గ్రామాల్లో అనధికారికంగా విద్యుత్ కోతలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- ఆక్వాపై తీవ్ర ప్రభావం
- ముందస్తు సమాచారం ఇవ్వాలంటున్న రైతులు



అల్లవరం విద్యుత్ సబ్ స్టేషన్



రెల్లుగడ్డలో చేపలు, రొయ్యల చెరువు

అల్లవరం: ప్రభుత్వం అనధికార విద్యుత్ కోతలతో ప్రజలకు వాత పెడుతోంది. మండలవ్యాప్తంగా రాత్రి, పగలు తేడా లేకుండా అనధికారంగా కరెంట్ కోతలు విధించడంతో ప్రజలు సతమతమవుతున్నారు. కరెంట్ ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. రథసప్తమి అనంతరం ఎండల తీవ్రత పెరిగింది. మార్చి ప్రారంభం నుంచే భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. ఉష్ణోగ్రతలు పెరగడంతో విద్యుత్ వినియోగం బాగా పెరిగింది. డిమాండ్‌కు తగ్గ స్థాయిలో సప్లయి లేకపోవడంతో విద్యుత్ అధికారులు అనధికారికంగా విద్యుత్ కోతలు విధిస్తున్నారు.

ఆక్వా రైతులకు అష్టకష్టాలు

విద్యుత్ కోతల ప్రభావం ఆక్వా సాగుపై తీవ్రంగా ఉంది. ఏటా ఫిబ్రవరి నుంచి మే చివర వరకూ ఆక్వాకు అనుకూలమైన సమయం కావడంతో ఈ నెలల్లో రొయ్యల సాగు చేపడతారు. ఆక్వా సాగుకు విద్యుత్ ఆయువుపట్టు లాటింది. విద్యుత్ సక్రమంగా సరఫరా చేస్తేనే సాగులో లాభాలు ఆర్జించేది. ఏ మాత్రం కరెంట్ నిలిచినా రూ.కోట్లల్లో నష్టాలు చవిచూడవలసి వస్తుంది. కాగా పెరిగిన వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ అధికారులు కరెంట్ సరఫరా చేయడంలో విఫలమయ్యారు. మార్చి 7న గ్రిడ్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో రాత్రి 8 గంటల నుంచి మరునాడు ఉదయం 6 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆక్వా రైతులు, గృహ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

సరిపడా ట్రాన్స్‌ఫార్మర్లు లేకపోవడంతో..

అల్లవరం మండలంలోని దేవగుప్తం, అల్లవరం, బెండమూర్లంక సబ్ స్టేషన్ పరిధిలో అనధికార విద్యుత్ కోతలతో గృహ వినియోగదారులు, ఆక్వా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్లు గ్రామాల్లో లేకపోవడంతో సాధారణ స్థాయి కంటే తక్కువగా సరఫరా అవుతోంది. వేసవిని దృష్టిలో ఉంచుకుని ట్రాన్సఫార్మర్ ఏర్పాటు చేయాలని పలు గ్రామాల నుంచి ఫిర్యాదుల వస్తున్నా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదు.

వేలాది ఎకరాల్లో సాగు

ఉప్పలగుప్తం మండలంలో చల్లపల్లి, ఉప్పలగుప్తం సబ్ స్టేషన్ పరిధిలో అనధికార విద్యుత్ కోతలు విధిస్తున్నారు. ఈ రెండు ప్రాంతాల్లో రైతులు వేలాది ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నారు. విద్యుత్ కోతలతో చెరువుల్లో ఏరియాటర్లు పనిచేయక ఆక్సిజన్ శాతం పడిపోతుందని ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒక వేళ కరెంట్ కోతలు విధించాల్సి వస్తే అధికారికంగా ఏయే వేళల్లో కోతలు చేపడతారో ముందుస్తుగా రైతులకు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు. ముందస్తు సమాచారం ఇస్తే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటామని రైతులు చెబుతున్నారు.

తరచూ విద్యుత్ కోతలు



ఉప్పలగుప్తంలో 9 ఎకరాల్లో చేపలు, రొయ్యల సాగు చేస్తున్నాను. ఇటీవల కాలంలో తరచుగా విద్యుత్ కోతలు విధిస్తున్నారు. ఆక్వాకు తెల్లవారుజామున విద్యుత్ సరఫరా ఎంతో కీలకం. ఆ సమయంలో రొయ్యల చెరువులకు విద్యుత్ తప్పనిసరి. అయితే ఆ సమయంలో కరెంట్ కట్ చేసి ఉదయాన్ని ఇస్తున్నారు. దీని వల్ల ఆక్వాకు ఏలాంటి ఉపయోగం లేదు. విద్యుత్ కోతలతో చేపలు, రొయ్యలు మృత్యువాత పడుతున్నాయి. విద్యుత్ అధికారులు ఆక్వా రైతులను దృష్టిలో ఉంచుకుని రాత్రి వేళల్లో విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూడాలి.

–సుందరనీడి సురేష్, ఆక్వా రైతు, ఉప్పలగుప్తం

పెన్షనర్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలి



ముమ్మిడివరంలో అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న పెన్షనర్ల సంఘ నాయకులు

ముమ్మిడివరం: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రూ.వేల కోట్ల బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ముమ్మిడివరం తాలుకా పెన్షనర్ల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘ నాయకులు సోమవారం ముమ్మిడివరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల డీఏ, పీఆర్సీ, పీఎఫ్, గ్రూపు ఇన్సూరెన్స్, హెల్త్‌కార్డులకు సంబంధించిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్‌సీని ప్రకటించి తగురీతిలో ఐఆర్‌ను ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో ముమ్మిడివరం తాలుకా ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి వీరాస్వామి, ప్రధాన కార్యదర్శి పెద్దిరెడ్డి రాము, ట్రెజరర్ వైవీ రమణమూర్తి, జనిపెల్ల సత్యనారాయణ, ఏవీ సత్యనారాయణ, కోలా వెంకటేశ్వరరావు, పి.రామదాసు, బి.వరప్రసాదరావు, బి.కృష్ణమూర్తి, కె.సత్యనారాయణ, కె.నాగేశ్వరరావు తతదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన విహార యాత్రతో శాస్త్రీయ అవగాహన



అమలాపురంలో విద్యా విజ్ఞాన విహార యాత్ర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఈవో బాషా, విద్యాశాఖాధికారులు

అమలాపురం టౌన్: విద్యా విజ్ఞాన విహార యాత్రలతో విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన పెరుగుతుందని డీఈవో డాక్టర్ షేక్ సలీమ్ బాషా అన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహనే లక్ష్యంగా ఈ యాత్ర నిర్వహిస్తున్నామని చెప్పారు. స్థానిక కలెక్టరేట్‌కు ఎదురుగా ఉన్న అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు వద్ద విజ్ఞాన విహార యాత్ర పోస్టర్లను డీఈవో బాషా, జిల్లావిద్యాశాఖ ప్రతినిధులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. జిల్లా సైన్స్ కో ఆర్డినేటర్ జీవీఎస్ సుబ్రహ్మణ్యం, డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు సెక్రటరీ బీర హనుమంతరావు, అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ పి.రాంబాబు తదితరులు విహార యాత్ర వివరాలను వెల్లడించారు. ఈ నెల 21 నుంచి మూడు రోజులు పాటు జరిగే ఈ యాత్రలో భాగంగా తిరుపతి ఐఐటీ, తిరుపతిలోని రీజనల్ సైన్స్ సెంటర్, జంతు ప్రదర్శనశాలలు, వెటర్నరీ యూనివర్సిటీ, చంద్రగిరి కోట, కోరంగి అభయారణ్యం, యానాం కేంద్ర పాలిత ప్రాంతం వంటి ప్రముఖ విజ్ఞాన, శాస్త్రీయ, సాంస్కృతిక ప్రదేశాలను విద్యార్థులు సందర్శించనున్నట్టు తెలిపారు.

రాయితీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

తాళ్లరేవు: ప్రభుత్వం బీసీ సొసైటీల ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి యూనిట్ కాస్ట్ రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు 50 శాతం రాయితీతో అందించే రుణాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ కె.సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే కాపు, క్షత్రియ, బ్రాహ్మణ, రెడ్డి, కమ్మ తదితర కార్పొరేషన్ల ద్వారా 50 శాతం రాయితీతో రుణాలు పొందేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జనరిక్ మెడిసిన్ దుకాణాలకు బ్రాహ్మణ కార్పొరేషన్, బీసీ–ఎ నుంచి అర్హులైన లబ్ధిదారులకు రూ.8 లక్షల వరకు, అలాగే చేతివృత్తుల వారికి 50 శాతం రాయితీతో రూ.3 లక్షలు, మినీడైరీ యూనిట్‌కు 50 శాతం రాయితీతో రూ.5 లక్షలు పొందేందుకు బీసీ (ఎబిడిఇ) లబ్ధిదారులు అర్హులన్నారు. 21 నుంచి 60 ఏళ్ల మధ్య గల అభ్యర్థులు వ్యక్తిగతంగా గాని, బృందంగా గాని ఈ నెల 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామ సచివాలయాలు, మీ సేవా కేంద్రాలు, నెట్ వర్క్ కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీఓ తెలిపారు.

సర్పంచ్‌పై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

అమలాపురం రూరల్: రాజ్యాంగబద్ధమైన సర్పంచ్ పదవిలో ఉంటూ పలనాడు జ్యోతి దిన పత్రికలో విలేకరిగా పనిచేస్తున్న సర్పంచ్ తిక్కిరెడ్డి నాగ వెంకట శ్రీనివాసరావును పదవి నుంచి డిస్మిస్ చేయాలని కోరుతూ ఎంట్రుకోన గ్రామానికి చెందిన వాసర్ల సత్యనారాయణ జిల్లా కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంట్రుకోన గ్రామ ప్రజలు ఓటు వేసి గెలిపించుకున్నారని తెలిపారు. ప్రజల యోగక్షేమాలు, పాలనను గాలికి వదిలేసి విలేకర్‌గా పనిచేయడం చట్టరీత్యా నేరమని ఫిర్యాదులో పెర్కొన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేసి తిక్కిరెడ్డి నాగవెంకట శ్రీనివాసరావును సర్పంచ్ పదవి నుంచి డిస్మిస్ చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.

విద్యుత్ శాఖలో 177 హెల్పర్ పోస్టుల భర్తీకి ఆమోదం

యానాం: పుదుచ్చేరి విద్యుత్‌శాఖలో ఖాళీగా ఉన్న 177 కన్‌స్ట్రక్షన్ హెల్పర్ పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందని విద్యుత్‌శాఖ సూపరింటిండెంట్ ఇంజినీర్ రాజేష్‌సన్యాల్ సోమవారం తెలిపారు. ఈ పోస్టుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా ఆయా విభాగాల్లో వచ్చిన మార్కుల ఆధారంగా జరుగుతుందన్నారు. రాతపరీక్ష ఉండదని చెప్పారు. దీనికి సంబంధించి ఇప్పటికే ఆన్‌లైన్ అప్లికేషన్ల ప్రక్రియ ప్రారంభమైందని, ఈ నెలాఖరులోనే నోటిఫికేషన్ జారీ చేస్తారని చెప్పారు.

మహాబోధిని బౌద్ధులకు అప్పగించాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బుద్ధి సొసైటీ ఆఫ్ ఇండియా సభ్యులు

అమలాపురం రూరల్: బీహార్‌లో ఉన్న మహాబోధి, మహా విహార్‌లను భారతదేశంలో బౌద్ధులకు అప్పగించాలని కోరుతూ బుద్ధి సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. బుద్ధగయలో మహా బోధిని అప్పగించాలని, 1949 బీటీ చట్టాన్ని రద్దు చేయాలని, మహాబోధి ఆలయాన్ని బ్రాహ్మణులు ఆక్రమించుకున్నారని, వారి నుంచి తమకు అప్పగించాలని కోరారు. అనంతరం కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా బీఎస్ఏ అధ్యక్షుడు రాంబోది కాశి, ప్రధాన కార్యదర్శి ములపర్తి సత్యనారాయణ, ఉపాధ్యక్షుబే కోలా త్రిమూర్తులు, ఈవీవీ సత్యనారాయణ, జంగా రాజేంద్ర ప్రసాద్, కవల రమేష్, బొంతు బ్రహ్మయ్య, జల్లి శ్రీనివాస్, బీర సురేష్, గౌతమ్ అశోక్, పిల్లా రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ఎన్టీఆర్ వైద్య మిత్రల ధర్నా



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఎన్టీఆర్ వైద్య మిత్రలు

అమలాపురం రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద సోమవారం ఎన్టీఆర్ వైద్య మిత్రలు ధర్నా నిర్వహించారు. ఫీల్డ్ ఉద్యోగులుగా పనిచేస్తున్న తమను కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఆందోళన చేశారు. 17 సంవత్సరాల సర్వీసును పరిగణలోకి తీసుకొని ఫీల్డ్ సిబ్బందికి ప్రభుత్వ కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలని, వైద్య మిత్రలకు డీపీఓ కేడర్, ఆఫీస్ అసోసియేట్, టీమ్ లీడర్ల సమాన అర్హత కలిగిన కేడర్, జిల్లా మేనేజర్లకు డీవైఈవో కేడర్ అమలు చేసి కనీస వేతనం ఇవ్వాలని కోరారు. అనంతరం కలెక్టర్ మహేష్ కుమార్‌కు వినతి పత్రం అందించారు. సంఘం నాయకులు చీకట్ల వెంకయ్య నాయుడు, మచ్చా నరసింహరాజు, మామిడి శెట్టి శంకర్, చంద్ర శేఖర్, శ్రీధర్ బాబు,జల్లి సౌజన్య, అంగాని కుమారి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద కార్మికుల ధర్నా

అమలాపురం రూరల్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల నైట్ వాచ్‌మెన్‌గా, పారిశుధ్య సిబ్బందిగా పనిచేస్తున్న తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. రెండు నెలల జీతాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు, బీమా సౌకర్యం కల్పించాలని యూనిఫాం ఇవ్వాలని కోరారు. ఉదయం నుంచి కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు విజయ, కార్యదర్శి కుమారి, సీఐటీయూ జిల్లా కోశాధికారి భాస్కరరావు, సత్యవతి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

- పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట ఏర్పాట్లు
- తొలిరోజు పరీక్షకు 15 మంది విద్యార్థుల గైర్హాజరు



కామనగరువులో పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ నిషాంతి



అల్లవరంలో పరీక్ష కేంద్రంలోకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న విద్యార్థులు

తాళ్లరేవు: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మండల పరిధిలోని ఐదు కేంద్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతమైన యానాంలోని రెండు కేంద్రాల్లో 1468 విద్యార్థులకు గాను 1453 విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 15 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మండల పరిధిలోని తాళ్లరేవు, ఇంజరం, పటవల, పి.మల్లవరం, బొడ్డుదిన వెంకటాయపాలెం కేంద్రాలతో పాటు యానాంలోని రీజెన్సీ హైస్కూల్‌లోని రెండు సెంటర్‌లలో తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 9 గంటలకల్లా విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ఇన్విజిలేటర్లు విద్యార్థుల హాల్ టిక్కెట్లు, తదితర పరికరాలను క్షుణ్ణంగా పరిశీలించి పరీక్ష కేంద్రంలోకి పంపించారు. కోరంగి పంచాయతీ బొడ్డుదిన వెంకటాయపాలెంలో ముగ్గురు బాలురు, ఇద్దరు బాలికలు, తాళ్లరేవు హైస్కూల్‌లో ముగ్గురు బాలురు, ఆరుగురు బాలికలు, ఇంజరం పరీక్ష కేంద్రంలో ఒక బాలుడు పరీక్షకు హాజరు కాలేదు. మండల కేంద్రమైన తాళ్లరేవులోని నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించారు. పలు కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఉప్పలగుప్తం/కాట్రేనికోన: ఉప్పలగుప్తం మండలంలోని గొల్లవిల్లి, భీమనపల్లి, చల్లపల్లి, ఎన్.కొత్తపల్లి గ్రామాల్లో పది పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో 589 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 584 మంది హాజరయ్యారు. ఐదుగురు విద్యార్థులు పరీక్షలకు గైరాజరయ్యారు. కాట్రేనికోన మండలంలో కందికుప్ప, కాట్రేనికోన, దొంతికుర్రు, చెయ్యేరు నాలుగు కేంద్రాల్లో పరీక్షలు రాశారు. గచ్చకాయలపొర విద్యార్థులు ఎన్.కొత్తపల్లి కేంద్రంలో పరీక్షలు రాశారు. మండలంలో 574 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా ఇద్దరు గైరాజరవ్వటంతో 572 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. కాట్రేనికోన మండలంలో ఉన్న నాలుగు పరీక్ష కేంద్రాలు, ఎన్.కొత్తపల్లి పరీక్ష కేంద్రలో మాస్ కాపీయింగ్ జరిగినట్టు విద్యార్థులు మాట్లాడుకోవడం స్థానికంగా చర్చాంశనీయమైంది.

పదో తరగతి పరీక్షలు ప్రారంభం

అల్లవరం: మండలంలోని దేవగుప్తం, కొమరగిరిపట్నం, అల్లవరం ఉన్నత పాఠశాలల్లో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొమ్మిది ఉన్నత పాఠశాలలు, రెండు గురుకులాలు, రెండు ప్రైవేటు పాఠశాలలకు చెందిన 591 మంది విద్యార్థులు తొలి రోజు తెలుగు పరీక్ష రాశారు. దేవగుప్తంలో ఒక విద్యార్థి, అల్లవరం బీ సెంటర్ నుంచి ఇద్దరు విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్టు ఎంఈఓ–2 ఏడుకొండలు తెలిపారు. తొలిరోజు విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు గంట ముందుగానే చేరుకున్నారు. పరీక్షా కేంద్రాలు వద్ద ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు చొటుచేసుకోకుండా పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

ఐ.పోలవరం: మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మండల పరిధిలో నాలుగు పరీక్ష కేంద్రాలు ఉండగా 797 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. వీరిలో 365 మంది బాలురు, 432 మంది బాలికలు ఉన్నారు. ఐ.పోలవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏ- బీ సెంటర్లు ఉండగా, మురమళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల, సాయి ఉన్నత పాఠశాల మురమళ్లలో పరీక్షలు జరుగుతున్నాయి. తొలి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని మండల విద్యాశాఖ అధికారులు ఎస్.కొండారెడ్డి, వి.సురేష్ బాబు తెలిపారు. జి.మూలపొలం, వేమవరం విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు వచ్చేందుకు ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేశామని, ఇందుకు డీఈవో షేక్ సలీమ్ బాషా, కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సహకరించినట్టు తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించాలి


అమలాపురం రూరల్: పదో తరగతి పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అధికారులను ఆదేశించారు. రూరల్ మండలం కామనగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పదో తరగతి పరీక్షలను ఆమె పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అమలాపురం, పట్టణ, రూరల్ పరిధిలో 9 కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు డీవైఈవో గుబ్బల సూర్య ప్రకాష్ తెలిపారు.



ఐ.పోలవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పరీక్షలు రాసేందుకు వస్తున్న విద్యార్థులు



తాళ్లరేవు హైస్కూల్‌లో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



ఇంజరంలో విద్యార్థులను తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి పంపుతున్న సిబ్బంది



గొల్లవిల్లిలో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

నాణ్యత పెంచితే గిట్టుబాటు ధర

జిల్లా ఉద్యాన అధికారి రమణ



జిల్లా ఉద్యాన అధికారి రమణ

అమలాపురం రూరల్: అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని కొబ్బరి తోటల్లో అంతర పంటగా సాగు చేస్తున్న కోకో గింజలకు గిట్టుబాటు ధర పొందాలంటే ఉత్పత్తుల నాణ్యతను పెంచాలని జిల్లా ఉద్యాన అధికారి బీవీ రమణ సూచించారు. నాణ్యత పెంచేందుకు యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కోకో ఏడాది పొడవునా కాపు ఉన్నప్పటికీ మార్చి నుంచి మే నెలాఖరు వరకు మూడు నెలల పాటు మంచి దిగుబడిని ఇస్తుందన్నారు. ఈ సమయంలో వచ్చిన గింజలు అధిక నాణ్యత కలిగి ఉంటాయన్నారు. కోకో గింజలకు జాతీయంగా, అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఉందన్నారు. గతేడాది కిలో గింజలను రూ.950 నుంచి రూ.1,000 వరకూ కొనుగోలు చేశారన్నారు. ప్రస్తుతం కిలో ధర రూ. 550 నుంచి రూ.650 వరకూ ఉందన్నారు. పక్వానికి వచ్చిన కాయలను పదునైన కత్తితో చెట్టుకు హాని కలుగకుండా కోయలన్నారు. కోసిన కాయలను 2 నుంచి 3 రోజులు నిల్వచేసిన తర్వాత పగులగొట్టి గింజలు తీయాలని సూచించారు.